
సాక్షి
కాకినాడ
గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



పోలీసుల అదుపులో నిందితుడు

మైనర్ బాలికను ఎత్తుకెళ్లి హత్య చేసి పరారైన నిందితుడు బత్తిన నాని ఎట్టకేలకు పెద్దాపురం పోలీసులకు చిక్కాడు. 8లో▸



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధ వారం తూర్పు డెల్టాకు 4,200,మధ్య డెల్టాకు 2,200,పశ్చిమ డెల్టాకు 7,000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గెలుపు పొందు వరకు...



జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్‌లో తమ ప్రతిభా నైపుణ్యాన్ని ప్రదర్శించి, చాంపియన్ షిప్ సాధించ డమే లక్ష్యంగా డాక్టర్ బి.ఆ ర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

మళ్లీ జగనే ముఖ్యమంత్రి

కాపు నాడు రాష్ట్ర అధ్యక్షుడు అను



తుని: వచ్చే ఎన్నికల్లో ఎంత మంది కలిసి పోటీ చేసినా మళ్లీ జగనే ముఖ్యమంత్రి అవుతారని కాపు నాడు రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాల అను అన్నారు. యువ కాపునాడు పర్యటనలో భాగంగా బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తప్పు చేసి జైల్లో కూర్చున్న చంద్రబాబు కోసం ఒక సామాజికవర్గం మాత్రమే కృత్రిమ ఉద్యమాలు చేస్తోందన్నారు. కృత్రిమ ఉద్యమాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అన్ని కులాలకు సమాన న్యాయం జరిగిందన్నారు. కాపులంతా ఏకతాటిపై నడిచి వైఎస్సార్ సీపీకి మద్దతు పలకాలని కోరారు. త్వరలో రాజమహేంద్రవరం రూరల్‌లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ జాతీయ కార్యదర్శి లింగం రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల పోసీకుమార్, సాంస్కృతిక విభాగం రీజనల్ కోఆర్డినేటర్ నాగులాపల్లి ఆశ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం బస్ ప్రారంభం

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కాకినాడ బస్ డిపో నుంచి అరుణాచలం స్పెషల్ బస్సును బుధవారం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి దర్శనం అనంతరం ఈనెల 30వతేదీ రాత్రికి కాకినాడ చేరుకుంటుందన్నారు. కాకినాడ డిపో మేనేజర్ ఎంయువీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి బాలకృష్ణ, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

30న జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 30న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు.ఇంపాక్ట్ డయాగ్నోస్టిక్, మెడిప్లస్ ఫార్మసీ, క్విస్‌క్రాస్ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయన్నారు. పదవ తరగతి నుంచి డిగ్రీ,ఫార్మసీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ ఉద్యోగాలు అర్హులన్నారు. ,దాదాపు 185 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఇతర వివరాలకు 0884-2373270 నంబరుకు సంప్రదించవచ్చని సూచించారు.

రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందు

జిల్లా వ్యవసాయాధికారి విజయ్ కుమార్

గండేపల్లి: జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్నట్టు కాకినాడ జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయ్ కుమార్ తెలిపారు. మండలంలోని యర్రంపాలెంలో జిల్లాస్థాయి సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎలుకల వల్ల వరి పొలంలో 35 శాతం, నిల్వ సమయంలో 15 శాతం పంటకు నష్టం కలుగుతుందన్నారు. దీనిని నివారించేందుకు వాసన, రంగు లేని బ్రోమోడయోలిన్ మందుకు నూకలు, నూనె తగు పాళ్లలో కలిపి గుర్తించిన ఎలుకల బొరియల వద్ద పెట్టాలన్నారు. ఈ మందును అన్ని ఆర్‌బీకేల్లోనూ ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు రాష్ట్రజట్టు ఎంపిక

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో బుధవారం కాకినాడ జేఎన్టీయూకే క్రీడాప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ బాలికల ఖోఖో జట్టు ఎంపిక ను నిర్వహించారు. ఈ ఎంపికలకు సెలక్షన్ కమిటీ సభ్యులు ప్రకాశం జిల్లా కార్యదర్శి బి.కాశీవిశ్వనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. డీఎస్ఏ చీఫ్‌కోచ్ శ్రీనివాస్ కుమార్, ఖోఖో సంఘ కార్యదర్శి పీడీ పట్టాభి మాట్లాడారు. ఎంపికలకు 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి ఖోఖో సంఘ పర్యవేక్షులు ఎం. సీతారామ రెడ్డి, రిఫ్రెష్ బోర్డ చైర్మన్ మడకా ప్రసాద్, జిల్లా కోచ్ అప్పారావు ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్షలు నిర్వహించి రాష్ట్ర అండర్-14, 18 బాలికల ఎంపిక చేశారు.

అండర్-14 జట్టులో..

డి.సత్య, ఎస్‌కే హసీనా, ఎం.కృష్ణవేణి (తూర్పు), బి.గుణవతి, ఆర్.సరస్వతి, ఆర్.తనూజ (శ్రీకాకుళం), బి.నికిత (చిత్తూరు), కె.భవాని (నెల్లూరు), ఎస్.లక్ష్మీదేవి (విజయనగరం), బి.కళ్యాణి (ప్రకాశం), జి.హర్షితారెడ్డి (కడప), బి.రంగమహాలక్ష్మీ (గుంటూరు), కె.నవ్యశ్రీ (పశ్చిమ), హెచ్ అంజలి (అనంతపూర్)లు ఎంపికయ్యారు.

అండర్-18 జట్టులో..

జి.పావని,డి.నందిని, ఎస్ఎస్‌డి ఐశ్వర్య, ఏ.మౌనిక (తూర్పు), ఎం.సఖియా,ఆర్ యశోద, బి.శ్రీజ (ప్రకాశం), టి.అనిత (పశ్చిమ), జి.దీప్తి (కృష్ణ), పి.జోష్న (విశాఖ), కె.రమ్య (నెల్లూరు), బి.అలేఖ్య (గుంటూరు), ఆర్ ఝాన్సిరాణి (చిత్తూరు) ఎంపికైన వారిలో ఉన్నారు.

బోధనలో డిజిటల్ విప్లవం

- ప్రభుత్వ స్కూళ్లలో ఆధునిక పద్ధతులు
- రెండోఏడాదీ ట్యాబుల పంపిణీకి చర్యలు
- మరమ్మతుల బాధ్యతా ప్రభుత్వానిదే
- వినియోగంపై విస్తృత అవగాహన



ట్యాబ్‌లతో పాఠశాలల్లో విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జగన్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో సమూల మార్పులు ప్రవేశపెడుతోంది. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతోంది. ఎప్పటికప్పుడు ఆధునిక విధానాలను అనుసరించి ఈ స్కూళ్లు పోటీలో నిలిచేలా నిరంతర కసరత్తు చేస్తోంది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులు, షూలు ఇలా అన్నీ సమకూర్చుతూ మరో పక్క బోధనా పద్ధతుల్లో కూడా వినూత్న పద్ధతులు పాటించేలా సంస్కరిస్తోంది. గడచిన నాలుగున్నర సంవత్సరాలుగా ప్రభుత్వ స్కూళ్లలో విద్యా ప్రమాణాలు పెరిగాయి. ఈ నేపథ్యంలోనే ఈ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. మునుపటి ప్రభుత్వ స్కూళ్లు కావని తల్లితండ్రులూ గుర్తిస్తున్నారు.

చురుగ్గా ఏర్పాట్లు

సర్కారు బడుల్లో చదుకునే విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడాలనేది రాష్ట్ర ప్రభుత్వ బలమైన సంకల్పం. ఒక్క తెలుగు మాధ్యమంతో వీరు కార్పొరేట్ స్కూలు పిల్లలతో పోటీ పడలేరని గ్రహించి ఆంగ్ల మాధ్యమాన్ని ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా బై-లింగ్విల్ పద్ధతిలో పుస్తకాలను ముద్రించింది. అంతేకాదు ఎనిమిదో తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్ ఇన్‌స్టాల్ చేసిన ట్యాబులను అందజేస్తోంది. ఒక్క సంవత్సరం మొక్కుబడిగా ఇచ్చి చేతులు దులుపుకోలేదు. వరుసగా రెండో ఏడాది కూడా ట్యాబుల పంపిణీకి విద్యాశాఖ చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. గతేడాది జిల్లాలోని విద్యార్థులు, టీచర్లకు కలిపి 23,099 ట్యాబులను పంపిణీ చేసింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.67.23 కోట్లు ఖర్చు చేసింది.

తరగతిలోనే బోధనకు సన్నాహాలు

ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలోని 380 పాఠశాలల్లో దాదాపు రూ.64 కోట్ల ఖర్చుతో 19,982 మందికి ట్యాబుల పంపిణీకి సన్నాహాలు జరుగుతున్నాయి. ట్యాబు ద్వారా బైజూస్ కంటెంట్ విద్యార్థులకు బోధించేందుకు పాఠశాలలోని ప్రతి తరగతి గదిలో ఐఎఫ్ ప్యానెల్, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులకు సులభంగా బోధించేందుకు మార్గం ఏర్పడుతోంది. ప్రతి ట్యాబ్ కూడా మూడేళ్ల వారంటీతో కొనుగోలు చేయాలని నిర్ణయించింది. విద్యార్థులు ట్యాబ్‌లు ఉపయోగించే క్రమంలో ఏదైనా పొరపాటున స్క్రీన్ డ్యామేజీ జరిగితే ప్రభుత్వమే బాగు చేయించాలని సంకల్పించింది.

ప్రతినెలా పాఠశాలల సందర్శన

విద్యార్థులకు అందజేసిన ట్యాబులు దుర్వినియోగం కాకుండా డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. డిజిటల్ అసిస్టెంట్లు ప్రతినెలా కనీసం ఒక్కసారి ప్రతి పాఠశాలనూ సందర్శిస్తారు. ట్యాబ్‌ల పనితీరు చెక్ చేస్తారు. ట్యాబ్ రిపేరు బాధ్యతలు కూడా చూస్తారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కూడా ప్రతివారం పాఠశాలను సందర్శిస్తారు. ప్రతి శుక్రవారం ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడి ట్యాబులకు వైఫై కనెక్ట్ చేసి వినియోగ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ట్యాబ్ దుర్వినియోగం చేయకుండా ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. యూట్యూబ్, కెమెరా, ఇతర యాప్‌లు ఓపెన్ కాకుండా టిక్టోరో అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ సహాయంతో చర్యలు చేపట్టింది. మూడు యాప్ వైఫై, బైజూస్, (డిక్షనరీ)ను అందుబాటులో ఉంచింది. ఎప్పటికప్పుడు అప్‌డేట్‌చేయడానికి ఎంఆర్సీ సిబ్బంది, సీఆర్పీలకు, పాఠశాల హెచ్‌ఎంలు, యాక్టివ్ టీచర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తోంది. వీరంతా పాఠశాల స్థాయిలోనే అప్‌డేట్ ప్రక్రియ చేపడుతున్నారు. ఈ క్రమంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే హెల్ప్ లైన్లు కూడా సిద్ధం చేశారు.

మండలం	ట్యాబుల సంఖ్య
కాకినాడ	2683
గండేపల్లి	483
గొల్లప్రోలు	685
జగ్గంపేట	989
కాజులూరు	582
కాకినాడ రూరల్	1246
కరప	873
కిర్లంపూడి	785
కొటనందురూ	391
పెదపూడి	544
పెద్దాపురం	1070
పిఠాపురం	1313
ప్రత్తిపాడు	697
రౌతులపూడి	523
సామర్లకోట	1226
శంఖవరం	652
తాళ్లరేవు	997
తొండంగి	925
తుని	1427
ఉప్పాడ కొత్తపల్లి	1025
ఏలేశ్వరం	866

మరమ్మతులకు స్పెషల్ డ్రైవ్



బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబుల మరమ్మతులకు రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు ఈనెల ఒకటి నుంచి జిల్లాలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. స్క్రీన్ రిపేర్ ఉంటే దాదాపు రూ.6వేలకు పైగా ఖర్చు వస్తుంది. ఈ మొత్తం కూడా ప్రభుత్వమే భరించనుంది.విని యోగంపై తరచూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– పి.ఈశ్వరశాస్త్రి, బైజూస్ ట్యాబుల నోడల్ అధికారి

నివేదిక పంపాం



ఈ విద్యా సంవత్సరంలో 8వ తరగతి విద్యార్థుల వివరాలను పంపించాం. ఉన్నత అధికారులు డిసెంబర్లోగా ట్యాబుల పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచించి ఖర్చుకు వెనుకాడకుండా విద్యార్థులకు ఉపయోగపడేలా బైజూస్ కంటెంట్ ట్యాబ్లను అందజేయడం సంతోషకరం.

– జి.నాగమణి, జిల్లా విద్యాశాఖాధికారి, కాకినాడ జిల్లా

ఉత్సాహంగా పాఠశాల క్రీడా సమాఖ్య ఎంపికలు

- రాష్ట్రస్థాయి పోటీలకు 142 మంది ఎంపిక
- అండర్-17, 14లో 1300 మంది హాజరు



టెక్నికల్ అఫీషియల్‌ను పరిచయం చేసుకుంటున్న ఉపవిద్యాశాఖ అధికారి ఆర్‌జేడీ రాజు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఆర్‌జేడీ రాజు పేర్కొన్నారు. బుధవారం కాకినాడ జిల్లా క్రీడామైదానంలో పాఠశాల క్రీడాసమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో క్రీడాకారులను వివిధ పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి నాగమణి ఆదేశాల మేరకు నిర్వహించిన ఎంపికలను రాజు ప్రారంభించారు. అర్బన్ ఎంఈఓ రవి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యం ఈ క్రీడల ద్వారా వెలికి వస్తాయన్నారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ త్రైక్వాండో, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ విభాగాల్లో అండర్ 14, 17 విభాగాల్లో ఎంపికలు నిర్వహించామన్నారు. ఫుట్‌బాల్ విభాగంలో 423, త్రైక్వాండోలో 420, హ్యాండ్‌బాల్‌లో 510 మంది హాజరయ్యారన్నారు. వీరి నుంచి 142 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశామన్నారు. వారంతా తెనాలిలో ఈ నెల 29 నుంచి అక్టోబరు 1 వరకు జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు కాకినాడలోని పీఆర్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని ఏజీఎఫ్ఐ కార్యాలయానికి అర్హత పత్రాలతో క్రీడాకారులు హాజరుకావాలని ప్రసాద్ కోరారు. పీడీలు నూకరాజు, బాబి, కొరు, స్వామి, శ్రీహరిరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వేతో వివాద రహిత గ్రామాలు



సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి

- అత్యంత పారదర్శకంగా కార్యక్రమం అమలు
- రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి

కాకినాడ సిటీ: అత్యంత పారదర్శకంగా జవాబుదారీతనంతో ప్రజలకు భూ యాజమాన్య హక్కుల కల్పనకు, గ్రామాలను భూ వివాద రహితంగా మార్చేందుకు సీఎం జగన్ రాష్ట్రంలో విప్లవాత్మకంగా జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష అమలు చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ వివేకానంద హాలులో మిషన్ సభ్యులు జె.రామారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ లంక ప్రసాద్, సర్వే ఏడీ బి.లక్ష్మీనారాయణ తదితరులతో కలసి ఆయన సమగ్ర భూ సర్వేపై సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన శాఖల అధికారులు, సర్వే, సెటిల్‌మెంట్లు, భూ రికార్డుల శాఖ అధికారులు, సమగ్ర భూ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు తదితరులు హాజరై జిల్లాలో సమగ్ర భూ సర్వే పురోగతితో పాటు క్షేత్రస్థాయిలో రైతుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపైనా చర్చించారు. జిల్లాలో ఈ కార్యక్రమం కింద తొలిదశలో 121 గ్రామాల్లో, రెండో దశలో 82 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ పనులు పూర్తయినట్లు అధికారులు వివరించారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కులాలు, మతాలు, వర్గాలు, రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, సమర్థవంతమైన మానవ వనరులతో సమగ్ర భూసర్వే చేపడుతున్నట్లు వివరించారు. డిజిటల్ పాస్‌బుక్‌లు సైతం అందించే ఈ బృహత్తర కార్యక్రమం విజయవంతంగా సాగుతోందన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి, ఉన్నత స్థాయిలో పరిష్కరించేందుకు వీలుగా ఆయన ఆదేశాల మేరకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నూటికి నూరు శాతం ప్రజలకు న్యాయం చేయాలన్నదే సీఎం ఆకాంక్ష అన్నారు. ఆ మేరకే కార్యక్రమాలు అమలుకు కృషి చేస్తున్నట్లు నాగిరెడ్డి తెలిపారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను అత్యంత నాణ్యతతో, సంతృప్తి చెందేలా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ సూర్యప్రకాశరరావు, వివిధ ప్రాంతాల రైతులు అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ అవార్డు అందుకున్న కలెక్టర్



కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పూరీ నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ కృతికా శుక్లా, చిత్రంలో నగరపాలక సంస్థ కమిషనర్ నాగనరసింహారావు, మునిసిపల్ వైద్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్ ఉన్నారు

కాకినాడ సిటీ: పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో కాకినాడ మున్సిపల్ కార్పొరేషను స్మార్ట్ సిటీ అవార్డు సొంతం చేసుకుంది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ బ్రిలియంట్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన ఇండియా స్మార్ట్ సిటీస్ అవార్డు కంటెస్ట్ (ఐఎస్ఏసీ)-2022 విజేతలకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ నుంచి జిల్లా కలెక్టర్, కాకినాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి కృతికా శుక్లా, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, మునిసిపల్ వైద్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్‌తో కలసి అవార్డు అందుకున్నారు. స్మార్ట్ సిటీల పోటీలో పారిశుధ్య కేటగిరీలో ఘన వ్యర్థాల నిర్వహణ విభాగంలో కాకినాడ స్మార్ట్ సిటీ దేశంలోనే రెండోస్థానంలో నిలిచి ఈ అవార్డు దక్కించుకుంది. ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు ఇండోర్‌లో ఇండియా స్మార్ట్ సిటీ కాంక్లేవ్-2023 జరుగుతోంది. రెండో రోజు బుధవారం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ప్రారంభించారు. ప్రజల జీవన నాణ్యతను పెంచే లక్ష్యంతో స్మార్ట్ సిటీల్లో చేపడుతున్న వినూత్న, సుస్థిర, సమ్మిళిత, సురక్షిత ఆరోగ్య కార్యక్రమాలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులు అందజేస్తోందని కలెక్టర్ కృతికా శుక్లా ఈ సందర్భంగా పేర్కొన్నారు. పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో అవార్డు లభించినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. అవార్డు రావడంతో కీలకపాత్ర పోషించిన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, స్మార్ట్ సిటీ అధికారులకు, సిబ్బందికి, పారిశుధ్య సిబ్బందికి ధన్యవాదాలు, అభినందనలు తెలియజేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వచ్ఛంధ్ర ఉద్యమ స్ఫూర్తితో కాకినాడను ముందువరుసలో నిలిపేందుకు కృషి చేస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ ఈఈ మాధవి పాల్గొన్నారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

జేసీ ఇలక్కియ



కాకినాడ సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ సూచించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ కలెక్టరేట్ నుంచి ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె జిల్లా వైద్య ఆరోగ్యం, ఆరోగ్యశ్రీ తదితర విభాగాల అధికారులతో మాట్లాడారు. ఇప్పటికే ప్రత్తిపాడులో పైలట్ ప్రాజెక్టుగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించామన్నారు. దీనిలో గుర్తించిన లోటుపాట్లను సరిదిద్ది ఈ నెల 30 నుంచి పూర్తి స్థాయిలో శిబిరాల ఏర్పాటు సిద్ధం కావాలన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సమన్వయంతో శిబిరాలను నిర్వహించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో చేసిన ఇంటింటి సర్వే ఆధారంగా ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. కన్సల్టింగ్, పరీక్షల నిర్వహణ, మందుల పంపిణీ, ఆరోగ్యశ్రీకి రిఫర్ చేయడం తదితర అంశాలకు సంబంధించి ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. శిబిరాల వద్ద పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్ డాక్టర్ జె నరసింహనాయక్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ పి రాధాకృష్ణ, డీఎల్‌డీవో పి నారాయణమూర్తి, వైద్య అధికారి పావని తదితరులు హాజరయ్యారు.

సందడిగా వినాయక శోభాయాత్ర

సూర్యారావుపేట బీచ్‌లో గణనాథుల విగ్రహాలు నిమజ్జనం



కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జనం కోసం ట్రాక్టరుపై తీసుకువచ్చిన వినాయక విగ్రహం



గణపతి బొప్పా మోరియా : సూర్యారావుపేట సాగర తీరంలో వినాయక నిమజ్జనోత్సవంలో భక్తులు

కాకినాడ రూరల్: గణేష్ నవరాత్రులు ముగిశాయి. చవితి నుంచి తొమ్మిది రోజులు పాటు కాకినాడ నగరం, గ్రామీణంలో సందడి చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. మండపాల నుంచి విగ్రహాలను వాహనాలలో బాణాసంచా, సన్నాయి మేళాల నడుమ ఊరేగింపుగా నిమజ్జనానికు తరలించారు. కాకినాడ ఉప్పుటేరుతో పాటు సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జనాలకు అధికారులు అనుమతిచ్చారు. సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జన కార్యక్రమాలు కోలాహలంగా సాగాయి. శోభాయాత్రగా తరలిస్తూ జై బోలో గణేష్ మహరాజ్‌కు జై అంటూ... గణపతి బొప్పా మోరియా అంటూ భక్తులు నినాదాలతో హోరెత్తించారు. పోలీసుల భారీ బందోబస్తు నడుమ విగ్రహ నిమజ్జనం ప్రారంభమయ్యాయి. ఉదయం చిన్న చిన్న విగ్రహాలు రాగా మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భారీ విగ్రహాలు వస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది ఈ ఊరేగింపులో మహిళలు అధికంగా తరలివచ్చి భక్తిని చాటుకున్నారు. గురువారం కూడా నిమజ్జనాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. సముద్రంలో లోపలకు వెళ్లకుండా సివిల్, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ పర్యవేక్షణలో రూరల్ సీఐ శ్రీనివాసరావు, తిమ్మాపురంతో సహా పలు పోలీసు స్టేషన్ల సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. నగర, రూరల్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రసాదాలు వితరణ చేశారు. రూరల్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ బుధవారం సాయంత్రానికి 200 విగ్రహాలు నిమజ్జనం చేశారన్నారు.

క్లుప్తంగా

బిక్కవోలు లడ్డు రూ.77,777



పాటదారుకు లడ్డును అందిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ వీర వెంకట సుబ్బారెడ్డి

బిక్కవోలు: స్థానిక శ్రీ లక్ష్మీ గణపతిస్వామి ఆలయంలో లడ్డుకు వేలంపాట నిర్వహించారు. బుధవారం గణపతి నవరాత్రులలో భాగంగా ఆలయం వద్ద 50 కేజీ లడ్డు పాట నిర్వహించగా సోమేశ్వరం గ్రామానికి చెందిన కనకాల కృష్ణతేజ రూ.77,777కు దక్కించుకున్నారు. ఆయనకు ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాస్‌రెడ్డి లడ్డును అందించారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు సుహాన



సుహాన చాంది

కొత్తపేట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో కొత్తపేటకు చెందిన అంబటి సుహాన చాంది విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ పీఆర్ కళాశాల గ్రౌండ్‌లో ఇటీవల నిర్వహించిన స్కేటింగ్ పోటీలు రింగ -2 విభాగంలో సుహాన చాంది తృతీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని, రింగ్-3 విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. సుహాన స్థానిక ప్రైవేటు స్కూలులో చదువుతోంది.

గెలుపు పొందు వరకు... అలుపు లేదు మనకు!



రోప్ స్కిప్పింగ్ క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న పీఈటీ సాధన



నేషనల్ రోప్ స్కిప్పింగ్ పోటీలకు ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారిణులు

- జాతీయ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ లక్ష్యం
- గురుకుల విద్యార్థినులు ముమ్మరంగా సాధన
- 29 నుంచి 4 వరకు నాసిక్‌లో 24వ జాతీయ పోటీలు

తుని రూరల్: జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్‌లో తమ ప్రతిభా నైపుణ్యాన్ని ప్రదర్శించి, చాంపియన్ షిప్ సాధించడమే లక్ష్యంగా డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. గత నెల 12, 13 తేదీల్లో భీమవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో తుని మండలం వి.కొత్తూరు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. అండర్ -17 విభాగంలో బి.గీతిక, కె.స్నేహ, టి.పావని, అండర్ -14 విభాగంలో ఎ.హసీల, వై.జ్యోతి విశేష ప్రతిభను ప్రదర్శించారు. రోప్ స్కిప్పింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన మహారాష్ట్ర నాసిక్‌లో జరగనున్న 24వ ఆర్ఎస్ఎఫ్ఐ జాతీయ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ - 2023 పోటీలకు ఈ ఐదుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 29 నుంచి అక్టోబర్ నాలుగు వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో నేషనల్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ - 2023 పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో పాల్గొని చాంపియన్ షిప్ సాధించడమే లక్ష్యంగా విద్యార్థినులు నిర్విరామంగా సాధన చేస్తున్నారు. తొమ్మిదో తరగతి చదువుతూనే విద్యార్థినులు రోప్ స్కిప్పింగ్ సాధనలో పాల్గొంటున్నారు.

పీడీ, పీఈటీల పర్యవేక్షణలో శిక్షణ

జిల్లా, రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ ప్రదర్శించిన తమ విద్యార్థినులు జాతీయ స్థాయిలో రాణించనున్నారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల (వి.కొత్తూరు) ప్రిన్సిపాల్ నిర్మల కుమారి పేర్కొన్నారు. ఫిజికల్ డైరెక్టర్ ఆర్. రాజ్యలక్ష్మి, పీఈటీ సాధన పర్యవేక్షణలో బాలికలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

ప్రోత్సాహంతోనే



రాష్ట్ర ప్రభుత్వం, మా పాఠశాల ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్, పీఈటీల ప్రోత్సాహంతోనే జాతీయ రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కింది. మెడల్ సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తాను.
– ఎ.హసీల, అండర్ 14

నేషనల్స్‌కు సిద్ధమయ్యాను



నేషనల్స్‌లో విజయం సాధించేందుకు అనువుగా సాధన చేశాను. జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నాను.
– బి.గీతిక, అండర్ 17

సంతోషంగా ఉంది



జాతీయస్థాయిలో జరిగే రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికవడం సంతోషంగా ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతీయ రోప్ సిప్పింగ్‌లో విజయం సాధిస్తా నన్న నమ్మకం, ఆత్మ విశ్వాసం ఉంది.
– టి.పావని, అండర్ 17

గోల్డ్‌మెడల్ సాధిస్తా



జాతీయ స్థాయి జట్టుకు ఎంపికైనప్పటి నుంచి రోజూ సాధన చేస్తున్నాను. నెలరోజులకుపైగా శిక్షణ పొందాను. పీఈటీ, పీడీ ఆధ్వర్యంలో మెళకువలు నేర్చుకున్నాను. జాతీయ స్కిప్పింగ్ పోటీల్లో విజయం సాధించి గోల్డ్‌మెడల్ సాధిస్తాను.
– కె.స్నేహ, అండర్ 17

అదృష్టంగా భావిస్తున్నా



అండర్ 14 విభాగంలో జాతీయ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికవడం అదృష్టంగా భావిస్తున్నాను. వచ్చిన అవకాశంతో నాసిక్‌లో జరిగే నేషనల్ రోప్ స్కిప్పింగ్ పోటీల్లో విజేతగా నిలుస్తాను – వై.జ్యోతి, అండర్ 14

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు నాని



హత్య కేసు నిందితుడిని పెద్దాపురం డీఎస్పీ కార్యాలయానికి తీసుకువస్తున్న పోలీసులు

పెద్దాపురం: మైనర్ బాలికను ఎత్తుకెళ్లి హత్య చేసి పరారైన నిందితుడు బత్తిన నాని ఎట్టకేలకు పెద్దాపురం పోలీసులకు చిక్కాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కలవచర్ల సమీపంలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 20వ తేదీన పదేళ్ల ద్రోణ ప్రవీణకుమారి అలియాస్ మానస అదృశ్యమైనట్లు తల్లి జ్యోతి పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి మానస ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులకు మృతదేహం కనిపించడంతో మరింత లోతుగా దర్యాప్తు చేశారు. దీంతో బాలిక సమీప బంధువు బత్తిన నాని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని గుర్తించిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేసి ఎట్టకేలకు బుధవారం కలవచర్ల సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడు నానిని విచారణ కోసం పెద్దాపురం డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు చేసిన కృషిని ప్రజా సంఘాలు, కుటుంబ సభ్యులు అభినందించారు. పోలీస్ స్టేషన్ వద్ద టపాసులు పేల్చి పోలీస్ యంత్రాంగం చూపిన చొరవపై కృతజ్ఞతలు తెలిపారు. ఒక్కడే హత్య చేశాడా? మరెవరి హస్తమైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతు



రాకేష్ (ఫైల్)

ఆలమూరు: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని మడికిలో బుధవారం చేపట్టిన నిమజ్జనం కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అత్తిలి రాకేష్ (22) తన సహచరులతో 216ఏ జాతీయ రహదారి వద్ద ఉన్న రేవు వద్ద జరిగిన నిమజ్జనం ఉత్సవంలో పాల్గొన్నాడు. నిమజ్జనం చేసే క్రమంలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. ఆలమూరు పోలీసుల సహకారంతో స్థానికులు, బంధువులు గాలింపు చర్యలు చేపట్టినా రాకేష్ ఆచూకీ రాత్రి పొద్దుపోయే వరకూ లభ్యం కాలేదు. రాకేష్ ఎంబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు.

ప్రతి రైతూ వ్యాపార వేత్తగా ఎదగాలి

సీటీఆర్ఐ డైరెక్టర్ శేషమాధవ్



ఏపీసీఎన్ఎఫ్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంటున్న సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషమాధవ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రతి రైతు ఒక వ్యాపార వేత్తగా ఎదిగినప్పుడే ఆర్థికాభివృద్ధి చెందుతారని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ(సీటీఆర్ఐ) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషమాధవ్ అన్నారు. స్థానిక సీటీఆర్ఐ సెమినార్ హాల్లో ఆయన అధ్యక్షతన 'ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలలో వాణిజ్య వ్యాపారాలలో అవకాశాలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శేషమాధవ్ మాట్లాడుతూ పొగాకుతో పాటు పసుపు, మిర్చి, అశ్వగంధ, ఆముదంపై కూడా పరిశోధనలు నిర్వహిస్తామన్నారు. ఐసీఏఆర్-సీటీఆర్ఐ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి ఏపీసీఎన్ఎఫ్‌తో అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయూ) ఈ సందర్భంగా కుదుర్చుకున్నారు. ఐసీఏఆర్–సీటీఆర్ఐ ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఐఎంటీయూ) నోడల్ ఆఫీసర్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ హెచ్. రవిశంకర్, కలవచర్ల కేవీకే హెడ్ డాక్టర్ ఎస్‌జీఆర్ నాయుడు, ఐసీఏఆర్ డైరెక్టరేట్ ఆఫ్ ఫ్లోరికల్చర్ రీసెర్చ్‌హెడ్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ డీవీఎస్ రాజు, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ ఆధారిత నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు, డాక్టర్ వైఎస్సార్ హెచ్‌యూ ఉద్యాన పరిశోధన స్థానం సీనియర్ సైంటిస్ట్ పీసీ వెంగయ్య కొబ్బరి, తాటి ఉత్పత్తుల ప్రాసెసింగ్, విలువ జోడింపు, పూలసాగులు వాణిజ్యపరమైన అంశాలపై మాట్లాడారు. ఫార్మర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సి.చంద్రశేఖరరావు పొగాకులో వాణిజ్యపరంగా లైసెన్స్ పొందిన టెక్నాలజీస్ పైన, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె.సుమన్‌కళ్యాణి పసుపు, మిరపలో విలువ జోడింపు అంశాలపై చర్చించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు విశిష్ట అతిథుల చేతులమీదుగా మెమెంటోలు అందించారు. సీటీఆర్ఐ విభాగాల అధిపతులు, శాస్త్రవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సీఈవోలు, డైరెక్టర్లు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

ఇద్దరికి స్వల్పగాయాలు

దేవరపల్లి: మండలంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం దేవరపల్లి మండలం యర్నగూడెం వద్ద హైవే ఫ్లైఓవర్‌పై బుధవారం అర్ధరాత్రి సమయంలో ఓ వ్యాన్ ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ ఎస్‌కే అన్వర్ ఆలీ(38) మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు. హైదరాబాద్ నుంచి కాకినాడ వెళుతున్న కారును బుధవారం తెల్లవారు జామున దేవరపల్లి నుంచి గోపాలపురం రోడ్డులో ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ మోయ్యే కృష్ణ(41) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కర్రి ప్రకాష్, తాటిపాక పోలురాజు స్వల్పగాయాలతో బయటపడ్డారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీహరిరావు తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



కిరణ్ మృతదేహం

నిడదవోలు రూరల్: ప్రేమ విఫలమై మనస్తాపంతో పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ బుధవారం తెలిపారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామానికి చెందిన ముప్పిడి మందులయ్య కుమారుడు కిరణ్ (19) రావిమెట్లకు చెందిన ఒక బాలికను ప్రేమించాడు. అయితే కిరణ్ ప్రేమకు పెద్దలు అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 26న మంగళవారం గోపవరంలో తాను పనిచేస్తున్న గేదెల ఫామ్ వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న కిరణ్‌ను స్నేహితులు నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యసేవలందిస్తుండగా మృతిచెందినట్లు తండ్రి మందులయ్య ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభానీ పేర్కొన్నారు. చేతికొచ్చిన కుమారుడి ఆకాల మృతితో తల్లి మణితో పాటు కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కాజులూరు: యానం, ద్వారపూడి రహదారిలో మండలంలోని కోలంక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుగ్గుదుర్రు శివారు పాలమూరుపాడుకు చెందిన పాలుగుమాటి వెంకటదుర్గాప్రసాద్ (32) మృతి చెందాడు. దుర్గాప్రసాద్ కోలంకలోని కిరాణా షాపు నుంచి సామాన్లు కొనుగోలు చేసుకుని తన మోటారు బైక్‌పై ఇంటికి తిరిగి వెళుతున్నాడు. కోలంక అటుకులు మిల్లు వద్దకు వచ్చే సరికి ద్రాక్షారామ వైపు వెళుతున్న మరో బైక్ ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. దుర్గాప్రసాద్ తలకు బలమైన గాయమవడంతో స్థానికులు అతనిని యానాం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే అతను మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. గొల్లపాలెం ఎస్సై ఎస్.తులసీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దుర్గాప్రసాద్‌కు తల్లి, ఇద్దరు అక్కలు, ఒక తమ్ముడు ఉన్నారు. ఇద్దరు అక్కలకు వివాహాలు జరుగగా, అతనికి ఇంకా వివాహం కాలేదు.

నలుగురు దొంగల అరెస్ట్


- రూ.7లక్షల విలువైన బంగారం వగైరా స్వాధీనం
- చోరీ సొత్తు కొన్న ఇద్దరిపై కేసు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను ప్రకాశ్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 121 గ్రాముల బంగారం, మూడు సెల్‌ఫోన్లు, నాలుగు మోటారు బైకులు స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశ్‌నగర్ పోలీసు స్టేషన్లో బుధవారం విలేకరులకు సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ఆ వివరాలను తెలిపారు. రాజమహేంద్రవరం చుట్టు పక్కల జరుగుతున్న చోరీలపై ప్రత్యేక నేర నిరోధక బృందాలు సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.విజయపాల్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాయి. జంగారెడ్డిగూడెంకు చెందిన పోలవరపు నాగ దుర్గాప్రసాద్, ఏలూరు జిల్లా ఏటిగట్టు చేపల తూము ప్రాంతానికి చెందిన అత్తోటి జాన్‌ఫాల్, భీమడోలు మండలం గణపతి సెంటర్‌కు చెందిన తల్లి బోయిన నాగ దుర్గారావు, భీమడోలు రైల్వే గేట్ ప్రాంతానికి చెందిన కర్నాటి విజయకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. వారు నేరాలు చేసినట్టు ఒప్పుకున్నారు. ప్రకాశ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో నాలుగు ఇళ్లలో, మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు ఇళ్లలో దొంగతనాలు చేశారు. పెనుగొండ, నిడమర్రు, గణపవరం ప్రాంతాల్లో నాలుగు బైకులు దొంగతనం చేశారు. నిందితుల్లో ఒకరైన పోలవరపు నాగదుర్గా ప్రసాద్ పై 29 పాత కేసులు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. చోరీ సొత్తు కొనుగోలు చేసిన చిక్కాల రారాజు, మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు. రికవరీలో ప్రతిభ కనబరిచిన ఎస్సైలు పి.ప్రేమ్‌రాజ్, బి.హరిబాబు, కానిస్టేబుళ్లు వి.నాగరాజు, బి.విజయకుమార్, పి.పోసిరాజు, సీహెచ్ శేషు, ఎస్.గణేశ్వరరావు, డి.రాజశేఖర్, జి.సుమన్‌కు డీఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆదిత్య కళాశాలలకు అటానమస్ హోదా



ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య కళాశాలలకు అటానమస్ హోదా లభించినట్టు కళాశాలల వైస్ చైర్మన్ ఎస్. సతీష్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో ఉన్నత ప్రమాణాలను ప్రాతిపదికగా తీసుకుని యూజీసీ ఈ స్టేటస్‌ను ప్రకటించినట్టు తెలియజేశారు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలకు ఈ విద్యాసంవత్సరం 2023-24 నుంచి 2028-29 వరకు, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలకు 2023-24 నుంచి 2032-33 వరకు, ఆదిత్య ఫార్మసీ కళాశాలలకు పది సంవత్సరాలు ఈ అటానమస్ స్టేటస్ పొందినట్టు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) న్యూఢిల్లీ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఈ స్టేటస్ సాధించేందుకు కృషిచేసిన ఆదిత్య విద్యాసంస్థల సిబ్బందికి కళాశాల చైర్మన్ ఎన్. శేషారెడ్డి, సతీష్‌రెడ్డి, తదితరులు అభినందనలు తెలియజేశారు. క్యాంపస్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్, కె.రవిశంకర్, డి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.